క్లుప్తంగా

పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాజాం: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దొంతంశెట్టి శ్రీనివాసరావును విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం కలిసి, పరామర్శించారు. అనారోగ్యం కారణంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొంది, ఇంటి వద్దనే కోలుకుంటున్నట్లు తెలుసుకుని, ఆయన వద్దకు వెళ్లి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని, క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పార్టీ అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, రాజాం పట్టణ చేనేత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 64 మంది ఎంపిక



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీధర్ ఆచార్య ఆర్థిక సహాయంతో స్పందన అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగుల కళ్లను తనిఖీ చేశారు. మొత్తం 130 మంది హాజరు కాగా వారిలో పలు కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ జ్యోతి, బెవర ఈశ్వరరావు, గణపతి, తూముల యోగేంద్ర, ముంజి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

58 ఒడిశా మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మండలంలోని పలుచోట్ల అక్రమంగా నిల్వచేసిన 58 ఒడిశా మద్యంసీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని రాజాం ఎస్ఈబీ ఎస్ఐ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి, వెంకంపేట గ్రామానికి చెందిన బెవర అప్పయ్యమ్మ వద్ద నుంచి 28 మద్యంసీసాలు, ఉంగరాడమెట్ట వద్ద జరిపిన దాడుల్లో బోగి బంగార్రాజు, గండ్రేటి శ్రీనివాసరావుల వద్ద నుంచి 30 మద్యం సీసాలు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కాలువలో పూడికలు తీయిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికలను తొలగించడంతో పాటు వాటిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువలు, మురుగునీటి నిల్వల ప్రాంతాల వద్ద బ్లీచింగ్ చల్లడం, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టడం వంటివి చేయిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు.

తాగునీటి బోర్ల మరమ్మతులు



తాగునీటి బోరును బాగు చేస్తున్న మెకానిక్ కృపారావు

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు మంగళవారం చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో మూలకు చేరిన బోర్లు బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మెకానిక్ కళింగ కృపారావు తదితరులు పాల్గొన్నారు.

చేయూత డబ్బులు ఇవ్వాలని డిమాండ్



బొబ్బిలి రూరల్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు, సీఐటీయూ నేతలు

రామభద్రపురం: ఎన్నికల కోడ్ సాకు చూపిస్తూ కోర్టును ఆశ్రయించి, నిలిపివేసిన వైఎస్సార్ చేయూత డబ్బులను తక్షణమే మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని పలువురు మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆరికతోటకు చెందిన పలువురు మహిళలు ఎంపీడీవో ఈశ్వరమ్మను మంగళవారం కలిసి తమ గోడు వినిపించుకున్నారు. కొంతమంది మహిళలకు మాత్రమే చేయూత డబ్బులు జమఅయ్యాయని, జమ కాని వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిరువ్యాపారాలు చేసుకుని, మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించాలన్న సదుద్దేశ్యంతో గత ప్రభుత్వం ఏటా వేసిన చేయూత డబ్బులను ఎన్నికల కోడ్ సాకుతో టీడీపీ వాళ్లు నిలిపివేశారని దీంతో తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ చేయూత అందుకునే ప్రతీ మహిళ వివరాలు సచివాలయాల ద్వారా పంపిచామని, ఆ డబ్బులు పడని వారికి వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో బుగత రవణమ్మ, పత్తిగుళ్ల జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: చేయూత డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరుతున్న ఆరికతోట మహిళలు

బొబ్బిలి రూరల్: ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విడుదల చేసిన వైఎస్సార్ చేయూత డబ్బులను లబ్ధిదారులకు అందివ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పథకం లబ్ధిదారులతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన వైఎస్సార్ చేయూత పథకం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనివ్వకుండా ఎన్నికల కోడ్ సాకుతో చంద్రబాబు అండ్ కో అడ్డుకున్నారని తెలిపారు. ఇప్పుడు కొంతమంది ఖాతాల్లోనే ఆ పథకం డబ్బులు జమ అయ్యాయని, చాలామంది ఖాతాల్లో ఆ డబ్బులు జమ కాలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోని టీడీపీ ప్రభుత్వం ఆ డబ్బులు జమకాని వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

పండ్లతోటల పెంపకంపై రైతుల ఆసక్తి



కోడిశలో కొబ్బరిమొక్కలు పరిశీలిస్తున్న ఏపీవో హరనాధరావు

రేగిడి: పండ్లతోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారని ఏపీవో ఎస్.హరనాధరావు అన్నారు. మండలంలోని కోడిశ గ్రామంలో పురుషోత్తమరావు అనే రైతుకు ఉపాధి హామీ పథకం ద్వారా అందించిన కొబ్బరి మొక్కలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆ రైతు పొలం వద్దకు చేరుకుని, మొక్కల పెరుగుదలను గమనించారు. రైతుకు మొత్తం 120 మొక్కలు అందించామని, వాటి పెరుగుదల బాగుందన్నారు. ప్రభుత్వం రాయితీపై అందించే జీడి, మామిడి మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు విరాళం



ప్రధానోపాధ్యాయుడికి విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయిని సుధారాణి

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని సుధారాణి అదే పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలను విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావుకు ఆ నగదును మంగళవారం అందించారు. ఈ డబ్బులను పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్(మైక్‌సెట్) కొనుగోలుకు వినియోగిస్తామని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన ఉపాధ్యాయిని సుధారాణిని అందరూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ మండల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, కార్యకర్తలు

బొబ్బిలి: స్థానిక డిప్యూటీ డీఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నేతలు మంగళవారం ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్న సురేష్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్‌లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెబుతున్నా ఆ స్కూల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఓ వైపు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూనే మరో వైపు పుస్తకాలు, యూనిఫాం వారి దగ్గరే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తుండడం సరికాదన్నారు. చదువుతో వ్యాపారం చేయకూడదని హితవు పలికారు. విద్యాశాఖ అధికారులు స్పందించి, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్‌ను సీజ్ చేయాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు మణికుమార్, డేవిడ్, కిరణ్, సాయిమణి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్న అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. పట్టణంలోని పలు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల చదువుకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ధనుంజయ సురేష్, సూర్యనారాయణ, సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

బొబ్బిలి: పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 28వ తేదీన వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) నిర్ణయించిన ధరలకు వేలం వేస్తున్నామని, ఔత్సాహికులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు.

పక్కాగా 100 రోజుల పనిదినాలు కల్పించాలి

బొబ్బిలి రూరల్: ఉపాధి హామీ పథకం వేతనదారులకు 100 రోజుల పనిదినాలు పక్కాగా కల్పించాలని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. మండలంలోని రంగరాయపురం గ్రామంలోని వేతనదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించలేదని, చేసిన పనికి గిట్టుబాటు వేతనం కూడా రాలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల పనిదినాలు వేతనదారులందరికీ కల్పించాలని, గిట్టుబాటు వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో కరెంట్ కోతలు



కరెంట్ లేకపోవడంతో చీకటిలో ఒమ్మి గ్రామ సచివాలయం

రాజాం: మండలంలోని గ్రామాల్లో కరెంట్ కోతలు అధికమయ్యాయి. దీంతో సచివాలయాల్లో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలు అంతగా ఉండేవి కావని, సచివాలయాల పనివేళల్లో అస్సలు ఉండేవి కావని పలువురు అంటున్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు విపరీతంగా ఉంటున్నాయని, నివారణ చర్యలు ప్రభుత్వమే తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



దేవుదళ కేజీబీవీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఆయన మంగళవారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వారికి కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్యంతో బాధపడే విద్యార్థులకు తక్షణమే వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ప్రతిరోజూ పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. రాజాం గ్రీనరీ లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని, వెయ్యి మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.జనార్దనరావు, పీఎస్ఎన్ గుప్త, హెచ్ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మేలు



విత్తనాల శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ సాయికుమార్

బాడంగి: విత్తనశుద్ధితో మేలు అని, విత్తనాలు శుద్ధి చేసుకుని, నాటుకోవడం ద్వారా వరినారు, పంట తెగుళ్ల బారినపడకుండా ఉంటుందని వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) సాయికుమార్ తెలిపారు. మండలంలోని రేజేరు రైతు భరోసా కేంద్రంలో విత్తనశుద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన.. విత్తనాలను ఏ విధంగా శుద్ధి చేసుకోవాలని, దాని కలిగే ప్రయోజనాలను వివరించారు. సూడోమోనాస్ పౌడర్‌తో వరి విత్తనాలు శుద్ధి చేసుకుని వేసుకుంటే అగ్గితెగులు, పాముపొడ, వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. నారుకట్టలను కూడా సూడోమోనాస్ ద్రావణంలో ముంచి, శుద్ధి చేసుకోవచ్చన్నారు. మూడు గ్రాముల కార్బనిజం మందుతో వరి విత్తనాలు శుద్ధి చేసుకుంటే అగ్గితెగులు, పొడతెగులును నివారించుకోవచ్చన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన.. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

• మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాజాం: ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, అభిమానులకు పార్టీ, తాము అండగా నిలుస్తామని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశమైన ఆయన.. అధైర్యపడొద్దని మనకు మంచి రోజులు వస్తాయన్నారు. అన్ని మండలాల్లో స్థానిక సంస్థల్లో మన పార్టీ నేతలు అధికారంలో ఉన్నారని, ప్రజలకు మనవంతు సాయం చేయాలని తెలిపారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు మన పార్టీ నేతలు, కార్యకర్తలపై చేస్తున్న దాడులను ప్రజల ముందు ఉంచాలన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తే ప్రజలే రోడెక్కి టీడీపీ కూటమిని నిలదీస్తారన్నారు. మనం కూడా ప్రజల తరఫున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అమ్మకు వందనం, రైతు భరోసా నిధులను ఇంతవరకు కూటమి ప్రభుత్వం అందించలేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన వైఎస్సార్ చేయూత డబ్బులు కూడా చెల్లించకుండా ఆ నిధులను పక్కదారి పట్టించారని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులు గడవక ముందే ప్రజల్లో అసంతృప్తి ప్రారంభమైందన్నారు. హామీలు అమలుచేయకుండా ప్రజాక్షేత్రంలో కూటమి నేతలు గౌరవంగా తిరగాలంటే కష్టమేనన్నారు. ప్రభుత్వం చేసే ప్రజావ్యతిరేక విధానాలు, పాలనను ఎండగట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, గెడ్డాపు అప్పలనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, ముదిలి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు 'మురిపించే కథలు' బహూకరణ



డీఈవోకు పుస్తకాన్ని బహూకరిస్తున్న రచయిత దామోదరరావు

రాజాం: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు తాను రచించిన మురిపించే కథలు పుస్తకాలను డీఈవో ప్రేమ్ కుమార్‌కు మంగళవారం అందించారు. మహాత్మా గాంధీ జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను ఆసక్తి రేకిత్తించే కథల రూపంలో తెలుగుతో పాటు ఇంగ్లిష్ లోనూ మురిపించే కథలు పేరుతో పుస్తకాలు రాసినట్లు రచయిత దామోదరరావు తెలిపారు. డీఈవోతో పాటు డీసీఈబీ కార్యదర్శి సన్యాసిరాజులకు విజయనగరంలో అందించామని, అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఒక్కో పుస్తకాన్ని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ పుస్తకాలు విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు, మానసిక పరిపక్వతకు, గాంధీ కలలుగన్న మంచి సమాజానికి దోహదపడతాయన్నారు. దామోదరరావు ప్రతిభను డీఈవో, ఉపాధ్యాయులు ప్రశంసించి, అభినందించారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ దూబ సూరపునాయుడు, బొత్స వెంకటరావు, మజ్జి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న జేఈ శ్రావణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని తెలిపారు. రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం తొలగించడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. క్లోరినేషన్ ఎలా చేపట్టాలన్న దానిని గ్రామీణ తాగునీటి సరఫరాల విభాగం జేఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

వర్షంతో ఉపశమనం



తెర్లాంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చేరిన వర్షపునీరు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు, పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. గత కొన్ని రోజులుగా నెలకొన్న ఎండల వేడికి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వర్షం కారణంగా ఏర్పడిన చల్లని వాతావరణం ఊపిరిపీల్చుకునేలా చేసింది. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులు కూడా వరి నారుమడులు తయారు చేసుకునేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి వెదలు చల్లగా, వర్షాలు లేకపోవడంతో వరినారు మొలకలు రాలేదు. ప్రస్తుతం కురిసిన వర్షం నారు మొలకలు వచ్చేందుకు ఉపకరిస్తుందని అంటున్నారు.

పక్కాగా సోషల్ ఆడిట్



రుషింగిలో సామాజిక తనిఖీ చేస్తున్న సిబ్బంది

వంగర: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, గ్రామాల్లో సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) పక్కాగా జరుగుతోందని ఏపీవో మర్రాపు సత్యవతి మంగళవారం తెలిపారు. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ జరుగుతోందన్నారు. ఎస్ఆర్‌పీ మన్మధరావు ఆధ్వర్యంలో ఎనిమిది మంది డీఆర్‌పీలు బృందాలుగా ఏర్పడి, 29 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. జూలై 4వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టగా, జూలై 5వ తేదీన మండల స్థాయిలో సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు.

రైతు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ డీజీఎం రాజేంద్రన్

బాడంగి: స్థానిక సంతతోట వద్ద ఉన్న సచివాలయ నూతన భవనంలో చెరకు రైతుల అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ డీజీఎం జె.రాజేంద్రన్ మాట్లాడుతూ బొబ్బిలి లచ్చయ్యపేట చక్కెర కర్మాగారం పరిధిలోని చెరకు రైతులంతా అధిక దిగుబడులు వచ్చే మేలురకమైన చెరకు రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. సంకిలి సుగర్ ఫ్యాక్టరీ కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరాకు 60 టన్నుల వరకు దిగుబడులు వచ్చే మేలురకమైన కొత్త చెరకు వంగడాలను నాటుకోవాలన్నారు. అలాంటి విత్తనాలను ఫ్యాక్టరీ అరువుపై చేస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఆర్.రమేష్, ఎం.వెంకటరావు, డీవోఆర్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.